# సత్యధర్మములను అనుసరిస్తే అవే మిమ్మల్ని అన్నివిధాలుగా సంరక్షిస్తాయి

ఈ విజయదశమి అందరికీ పండుగ. కాని, కొందరికి ఇది చాలా దుఃఖాన్ని అందించింది. ఎందుకంటే, విజయదశమినాడు బాబా తన 'ఓల్డ్ బాడీ' (పూర్వ దేహమును) వదలిపెట్టడం జరిగింది. కాని, దేహము కేవలం భౌతికమైనది, లౌకికమైనది.

ఒకనాడు బాబా లక్ష్మీబాయికి రెండు బంగారు నాణెములిస్తూ, "లక్ష్మీబాయి! ఈ రెండు నాణెములు నీవు దగ్గర ఉంచుకో" అని చెప్పాడు. (స్వామి ఆ నాణెములను సృష్టించి భక్తులకు చూపించారు) ఇవే ఆ బంగారు నాణెములు. ఈ రెండుకూడను ఆధ్యాత్మిక సంబంధమైన కార్యములకు సహాయం చేసే సత్య, ధర్మములకు ప్రతీకలు. కనుకనే, 'సత్యధర్మము శాంతి ప్రేమలతో నీ నిత్య జీవన యాత్ర సాగించు' అని స్వామి చెబుతుంటాడు. సత్యమే ఆత్మ. ధర్మమే మనం ఆచరించవలసిన కర్తవ్యము. కాబట్టి, సత్యముతో నీవు ధర్మమును ఆచరించు. ఇదే సరియైన సాధన. సత్య ధర్మములు రెండే నిన్ను అన్నివిధాలుగా సంరక్షిస్తాయి; ఎన్ని కష్ట నష్టములనైనా, దుఃఖములనైనా పరిహారము గావిస్తాయి. ఈ జగత్తులో భౌతికంగా జీవితాన్ని గడుపుతున్నప్పుడు సత్య, ధర్మములను ఏమాత్రము వదలకూడదు. హృదయంలో సత్యము, చేతలలో ధర్మము – ఇవి చాలు; ఇంక ఏ సాధనలూ అక్కర్లేదు.

**శాశ్వతమైనది సత్యమొక్కటే!**

ఈ జగత్తులో కొన్ని వందల కోట్లమంది ఉన్నారు. కాని, అందరిలోనూ ఉన్నది ఒక్కడే.

sri sathyasai vachanamrutam

దీనిని పురస్కరించుకొనియే భగవద్గీతలో కృష్ణుడు చెప్పాడు, "మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః", "మీరు ప్రత్యేకమైనవారు కాదు, మీరందరూ నా అంశములే!" అని. 'రామా', 'కృష్ణా', 'అల్లా', 'జీసస్' ... ఇవన్నీ కేవలం పెట్టిన పేర్లేగాని పుట్టిన పేర్లు కావు. పేర్లు ఎన్ని చెప్పినప్పటికీ భగవంతుడు ఒక్కడే. భగవాన్ ఒక్కడే సత్యము. కనుక, మనము దైవాన్ని ఒక్కడిగానే భావించుకొని, సత్యాన్నే దైవంగా భావించుకొని ప్రచార ప్రబోధలు సల్పాలి. కేవలం దానధర్మములు చేస్తే సరిపోదు. ఏది చేసినప్పటికీ ముఖ్యముగా సత్యముతో చేయాలి. ఇట్టి మార్గమును అనుసరించినప్పుడు సర్వులూ సుఖపడతారు. ప్రపంచంలో ఉన్నటువంటిదంతా ఒక్కటే. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి', అదే సత్యము. ఆ సత్యము ఒక్కటే ఈ జగత్తులో శాశ్వతంగా నిలిచేది. అది మార్పుచెందనటువంటిది. మిగిలినవన్నీ కదలిపోయే మేఘాలే. రూపనామములు శాశ్వతములు కావు. సత్యాన్ని హృదయంలో పెట్టుకొని ఏది చేసినా అది ధర్మమే అవుతుంది. అందరుకూడను ఒక్కటే. ఎవరిని ప్రేమించినా దైవాన్ని ప్రేమించినట్లే. దైవము ఒక్కడే ముఖ్యమైనవాడు, శాశ్వతమైనవాడు. ప్రేమయే దైవము. ఆ ప్రేమతో మీరేమైనా చేయండి, అది విజయవంతమవుతుంది.

**దేహాన్ని కాదు, దేహిని ముఖ్యంగా పెట్టుకోండి**

ఇక్కడ చాలామంది యువజనులున్నారు. కనుక, ఒక విషయం మీకు చెప్పాలి. మీరు వేరుగా భావించకండి. ఇప్పటి కాలాన్నిబట్టి మగపిల్లలు, ఆడపిల్లలు ఇంద్రియాలకు దాసులై వికృతమైన జీవన విధానాలను అవలంబిస్తున్నారు. ఏ కులములో చూసినా, ఏ మతములో చూసినా, ఏ దేశములో చూసినా అన్ని వైపులా ఇదే ధోరణి కనిపిస్తున్నది. ప్రైమరీ స్కూలు పిల్లలనుండి డిగ్రీ చదివే పిల్లలవరకు అందరూ ఇదేరకమైన మార్గమును అనుసరిస్తున్నారు. ఈ ప్రేమ శాశ్వతమైన ప్రేమ కాదు; ఇది తాత్కాలికమైన ప్రేమ. నిజమైన ప్రేమ శాశ్వతమైనటువంటిది. అది ఎప్పటికీ మారదు. లౌకిక ప్రేమ దేహం ఉన్నంతవరకు మాత్రమే అనుభవించవచ్చును. కాని, దేహం పోయిన తరువాత ఎవరికి ఎవరు? ఎవరికీ ఎవరితోనూ సంబంధం లేదు.

**దేహము పాంచ భౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**

srisathyasaivahini.org

**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ యా**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ**

నిరామయుడైన దేహిని మనము మరువరాదు. దేహము శాశ్వతము కాదు. అటువంటి దేహమును విశ్వసించి దేహిని విస్మరించడం చాలా పొరపాటు. కనుక, దేహాన్ని ముఖ్యంగా పెట్టుకోకండి. దేహియే ముఖ్యము. దేహియే సత్యస్వరూపుడు. దేహిని మనము సత్యముగా భావించి అనుసరించినప్పుడు ఆ దేహియే సర్వమును చూసుకుంటాడు.

శిరిడీలో బాబా తన శరీరమును వదలిపెట్టేముందు భక్తులకు చెప్పాడు, "ఈ దేహమును మీరు ఆధారంగా పెట్టుకోకండి. కొన్ని నిమిషాలలో ఇది వాడిపోతుంది, మాడిపోతుంది. ఇలాంటిదానిని మీరు ఎందుకు సత్యంగా భావిస్తున్నారు? ఎవ్వరూ కంటిధారలు కార్చవద్దు. ఇది సహజమైనటువంటిది. ఉన్నంతవరకు అనుభవించండి. తదుపరి ఇదంతా ఒక స్వప్నంగా భావించండి." ఇదంతా ఒక 'డ్రీమ్' (కల)! ఇది కొంతకాలము మాత్రమే ఉంటుంది. బాబా దేహాన్ని వదలిపెట్టిన తరువాత తాను తిరిగి వస్తాడో యేమో అని భక్తులు చాలాసేపు కాచుకొని ఉన్నారు. తరువాత, "ఇంతకాలం బాబా చెప్పింది మనము మరచిపోతున్నాము. బాబా చెప్పింది సత్యవాక్కు. దానిని మనము అనుసరించాలి. కనుక, మనము చేయవలసిన క్రియలు చేయాలి" అని గుర్తించి చావడిలోనుంచి బాబా దేహాన్ని తీసికొనిపోయి సమాధి చేశారు. కనుక, ఎంతకాలము ఉన్నప్పటికీ దేహాలు ఎప్పటికీ అశాశ్వతాలే! ఈ దేహమునకూ, ప్రతి దేహమునకూ ఒక పరిమితి ఉన్నది. ఆ 'లిమిట్' దాటి పోవడానికి వీల్లేదు.

ప్రేమస్వరూపులారా! మీరు ప్రేమను ప్రధానంగా పెట్టుకోండి. సత్యమును హృదయంలో నిల్పుకోండి. ఏ పని చేసినప్పటికీ ధర్మబద్ధంగా చేయండి. సత్యమే ధర్మమును పోషిస్తుంది. ధర్మమే సత్యమును కాపాడుతుంది. మనము సత్య ధర్మములను ప్రధానంగా పెట్టుకుంటే అవే మనల్ని పోషిస్తాయి, ప్రపంచాన్ని సంరక్షిస్తాయి. ప్రపంచాన్ని సంరక్షించడానికి మనము ఏవో ప్రయత్నాలు చేయనక్కర్లేదు. సత్యధర్మములను

sri sathyasaivachanamrutam

హృదయంలో ప్రతిష్ఠ చేసుకొని ఆచరణలో పెడితే చాలు. సత్యధర్మములను మీరు కేవలం మాటలకు పరిమితం చేస్తున్నారు. కేవలం నోటితో చెపితే ప్రయోజనం లేదు; గ్రామఫోను ప్లేటుకూడా చెబుతుంది. మీరు హృదయంతో చెప్పాలి; హృదయంతో చెయ్యాలి. అప్పుడే అవి తగిన ఫలితము నందిస్తాయి; మన హృదయంలో అవి శాశ్వతంగా ప్రింటైపోతాయి; మన ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉండి మనల్ని అన్నివిధాలుగా పోషిస్తాయి. ఈవిధమైన సాధనకు మీరు ప్రయత్నించాలి.

**సత్యమే మన ప్రాణము, ధర్మమే మన శ్వాస**

ఎన్ని సాధనలు చేసినప్పటికీ సత్యధర్మములను ప్రధానంగా తీసుకోవాలి; శాశ్వతంగా పెట్టుకోవాలి. ఎన్ని నామములు ఉచ్చరించినా, ఎన్ని మంత్రములు పఠించినా, ఎన్ని యజ్ఞయాగములు ఆచరించినా కట్టకడపటికి నిలిచేవి, మనవెంట వచ్చేటటువంటివి ఈ రెండే! కాబట్టి, ఈ రెండింటినీ మీరు అనుస రించండి. అనేక జన్మలనుంచి సత్యధర్మములు మీ వెంట వస్తున్నాయి. ఇవి మారేటటువంటివి కావు. ఈ రెండింటినీ మీరు ఆధారముగా తీసుకున్నప్పుడు ఇంతకంటే మరి ఏ సాధనలూ చేయనక్కర్లేదు. మీరు ఎన్నో సాధనలు చేస్తున్నారు. కాని, కట్టకడపటికి ఆ సాధనలన్నీ వ్యర్థమైపోతున్నాయి. “రాం, రాం, రాం...” అంటూ మీరు జపం చేస్తున్నారు. చేతిలో మాల తిరుగుతున్నదేగాని మనస్సు ఆ నామంపై తిరగడం లేదు. మాల తిరగడం ప్రధానం కాదు, మనస్సు దానిపై తిరగాలి. అప్పుడే దీనికి సరియైన సార్థకత. మనము ఏమి చేసినా సత్యముతో చేయాలి; ఏమి చెప్పినా అది సత్యముపై ఆధారపడి ఉండాలి. సత్యమే మనకు ప్రధానమైన ప్రాణము. ధర్మమే మన శ్వాస. ఈ రెండింటినీ ఆధారముగా పెట్టుకున్నప్పుడే మన జీవితము సార్థకమవుతుంది. వీటిని విస్మరించి ఎన్ని ఉపన్యాసములు విన్నప్పటికీ, ఉపనిషత్తులు, గీత, శాస్త్రములు ఎన్ని పఠించినప్పటికీ అవి జన్మను సార్థకం చేయలేవు. ముక్తికి ఈ రెండే ముఖ్యము.

**'మతులు మంచివైన మతమేది చెడ్డది!'**

“మేము దైవముయొక్క అంశము” అని ఎల్లప్పుడు మీరు జ్ఞప్తియందు ఉంచుకోవాలి. దైవంతో మీకు గల సంబంధాన్ని గుర్తించాలి. ఈ 'రిలేషన్‌షిప్' ఎప్పటికీ పోయేటటువంటిది

sri sathyasaivachanamrutam

కాదు. మీరు ఏ మతమునకు చెందినవారైనా, ఏ ప్రాంతమునకు చెందినవారైనా ఎక్కడికి పోయినప్పటికీ ఉన్నది ఇదొక్కటే. కనుక, మత భేదములు పెట్టుకోకండి. ఏ మతమైనా ఒక్కటే. మతులు మంచివైన మతమేది చెడ్డది! కనుక, మతిని మంచిదిగా పెట్టుకోవాలి. మతమును సరిగా అర్థం చేసుకోవాలి. మనసు మారిపోతుందికాని, మతము ఎప్పటికీ మారదు. కనుక, ఈవిషయంలో మీరు సందేహాలకు అవకాశమివ్వకండి. సత్యము, ప్రేమ – ఈ రెండింటినీ దృష్టిలో పెట్టుకోండి. సత్యమే ఆత్మ. మీరు 'మై సెల్ఫ్' అని అంటుంటారు. 'సెల్ఫ్' అంటే ఏమిటి? అదే ఆత్మ. ఆత్మను అనుసరించడమే మీ ధర్మంగా పెట్టుకోవాలి. ఆత్మను అనుసరించేవానికి ఏవిధమైన ముప్పు రాదు; సర్వమూ ఒక్కటైపోతుంది. ఈ సత్యాన్ని మీరు గుర్తించి హృదయంలో భద్రంగా పెట్టుకున్నప్పుడే ధన్యత చెందుతారు.

**మీరందరూ సత్యస్వరూపులే! సత్యసాయి స్వరూపులే!**

ప్రేమస్వరూపులారా! మీరు సత్యధర్మములను వదలకుండా హృదయంలో పెట్టుకోండి. ధర్మమంటే కేవలం దానము చేయడం కాదు. అంతరాత్మ తలచినటువంటిదానిని చేయాలి. దీనిని సత్యంగా మీరు అనుసరిస్తే మీరెప్పుడూ సత్యస్వరూపులే! You are the embodiments of truth. మీరందరూ సత్యసాయి స్వరూపులే! దీనిని మనస్సులో ఉంచుకొని మీ దివ్య జీవితాన్ని కొనసాగించండి. "ఈ దసరా ఉత్సవాలలో స్వామి ఒక్క దినమైనా మాతో మాట్లాడ లేదే!" అని మీరు అనుకుంటున్నారు. ఈనాడు విజయదశమి; పాత దేహమును వదలిన దినము. కొత్త దేహముతో వచ్చి పాత దేహముతో జరిగినటువంటివన్నీ నిరూపించాను. ఎన్ని అవరోధాలు ఉండినప్పటికీ మీ సాధనను మీరు కొనసాగిస్తూ ఉండాలి. దుస్సంగములో మీరు చేరకూడదు. దుస్సంగములో చేరితే మీరుకూడా చెడ్డవారైపోతారు. ఎప్పుడుకూడను సత్సంగములో ఉండాలి. సత్సంగమంటే? సత్య, ధర్మములే! కనుక సత్య, ధర్మములను వదలకుండా ఎలాంటివారితో చేరినప్పటికీ మీరు బాగుపడతారు.

కొన్ని దినములలోనే దేశమంతా ఒక్కటవుతుంది. ఏవిధమైన జాతి, మత, కుల భేదములు లేకుండా అందరూ ఒక్కటైపోయి, ఏకత్వాన్ని పొంది, దివ్యత్వాన్ని అనుభవిస్తారు.

srisathyasaivecharamrutam

అందరియందు సోదరీ సోదర భావము త్వరలోనే వస్తుంది. మీరు ఒకరినొకరు 'బ్రదర్' అని, 'సిస్టర్' అని పిలుచుకుంటారు; 'హలో, హలో' (hello, hello) అని పలుకరించుకుంటారు. కాని, లోపల 'హోలో' (hollow)గా ఉంటే ప్రయోజనమేమిటి! మీరు చిరునవ్వుతో ప్రేమగా పలుకరించుకోవాలి; గట్టిగా నవ్వకూడదు. 'అహ్హహ్హహ్హ' అని గట్టిగా నవ్వితే అల్లరి చేసినట్లవుతుంది. 'స్వీట్'గా, 'సాఫ్ట్'గా నవ్వాలి.

మీరందరూ చాలా అదృష్టవంతులు. లక్ష్మీబాయికి బాబా ఇచ్చిన బంగారు నాణెములయొక్క అర్థాన్ని మీకు తెలిపాను. ఈ రెండు 'కాయిన్స్'ను లక్ష్మీబాయి చాలా కాలం తనదగ్గరే పెట్టుకుంది. "ఇవి బాబా ఇచ్చిన నాణెములు. ఇవి బంగారు నాణెములు, వజ్రాల నాణెములు. సత్యం, ధర్మం – ఇవే ఈ రెండూ. వీటికంటే మించినది ఏదీ లేదు. ఇవి తప్ప నాకేమీ అక్కర్లేదు", అని భావించింది. ఈ 'కాయిన్స్'ను ఆమె దగ్గరనుండి లాగాలని ఎందరో ప్రయత్నించారు. కాని, ఆమె ఎవ్వరికీ ఇవ్వలేదు. ఒకరోజున ఆమె బిడ్డ వచ్చి, "అమ్మా! ఆ రెండు నాణెములు నాకిచ్చేసెయ్" అని కోరింది. కాని, లక్ష్మీబాయి అంగీకరించలేదు. "ఇవి ఎవరిచ్చారో వారి దగ్గరకే పోవాలి; ఇంకెవ్వరివద్ద చేరడానికి వీల్లేదు; ఇవ్వడానికి నాకు అధికారము లేదు. ఇవి సత్యస్వరూపుడైన బాబానుండి వచ్చాయి. తిరిగి ఆయననే చేరుకుంటాయి", అని చెప్పింది. కట్టకడపటికి ఒకనాడు రెండూ తీసి బాబా చేతిలో పెట్టింది. "మీరిచ్చినవి మీకే ఇస్తున్నాను! నా బిడ్డలకు గాని, మరెవ్వరికిగాని వీటిపై అధికారం లేదు. ఎవరితోనూ నాకు సంబంధం లేదు", అని చెప్పింది. పుట్టడంవల్ల బిడ్డలు; కట్టుకోవడంవల్ల భార్యాభర్తలు. కట్టుకోకపోతే భార్య లేదు, భర్త లేదు. వాళ్లిద్దరు లేకపోతే కొడుకు లేదు, కూతురు లేదు. ఎవ్వరికీ ఎవరితోనూ సంబంధం లేదు. ఎవరికి వారే యమునా తీరే! కనుక,

*"భజ గోవిందం భజ గోవిందం*
*గోవిందం భజ మూఢమతే*
*సంప్రాప్తే సన్నిహితే కాలే*
*నహి నహి రక్షతి డుకృఞ్ కరణే"*

**( విజయదశమి, తేదీ 21.10.2007, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasaivachanamrutam